క్లుప్తంగా

చిన్నారులచే సూర్య నమస్కారాలు

అమలాపురం టౌన్: మాఘమాసం సందర్భంగా స్థానిక విద్యుత్‌నగర్‌లోని హలో కిడ్స్ ప్లే స్కూలు చిన్నారులకు స్థానిక వాకర్స్ హెల్త్ క్లబ్ ఆధ్వర్యంలో సూర్య నమస్కారాలు చేయించి వాటి ప్రాధాన్యతపై గురువారం అవగాహన కల్పించారు. యోగా టీచర్ సీహెచ్ ఉషారాణి చిన్నారుల చేత యోగాసనాలు, సూర్య నమస్కారాలు చేయించారు. కార్యక్రమంలో వాకర్స్ క్లబ్ అధ్యక్షుడు యర్రమిల్లి సత్యనారాయణమూర్తి, కార్యదర్శి పుత్సా కృష్ణ కామేశ్వర్, కోశాధికారి పచ్చిగోళ్ల రాజా, సహాయ కార్యదర్శి మేడిశెట్టి నాగేశ్వరరావు, యర్రమిల్లి రామతులసి, పచ్చిగోళ్ల సత్యకుమారి తదితరులు పాల్గొన్నారు.

కోదండ రామాలయానికి ఎమ్మెల్యే విరాళం



పోలేకుర్రు రామాలయానికి విరాళం అందజేస్తున్న ఎమ్మెల్యే పొన్నాడ

తాళ్లరేవు: పోలేకుర్రులో నూతనంగా నిర్మించిన కోదండ రామాలయాన్ని ముమ్మిడివరం ఎమ్మెల్యే పొన్నాడ వెంకట సతీష్‌కుమార్ గురువారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు చేసి ఆలయానికి రూ.50 వేల విరాళాన్ని అందజేశారు. ఆయన వెంట ఎంపీపీ రాయుడు సునీత, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి దున్నా జనార్దనరావు, వైస్ ఎంపీపీ ధూళిపూడి నాగేంద్రప్రసాద్, సర్పంచ్ వెంటపల్లి నూకరాజు, ఎంపీటీసీ సభ్యురాలు బళ్ల సంధ్యారాణి, మాజీ ఎంపీటీసీ సభ్యురాలు ఎరికే దుర్గమ్మ తదితరులు పాల్గొన్నారు.

పలువురిని పరామర్శించిన ఎమ్మెల్యే పొన్నాడ

కాట్రేనికోన: ఇటీవల కాలంలో అనారోగ్యంతో మృతి చెందిన పలువురి కుటుంబ సభ్యులను ముమ్మిడివరం ఎమ్మెల్యే పొన్నాడ వెంకట సతీష్‌కుమార్ గురువారం పరామర్శించి ఓదార్చారు. కందికుప్ప సర్పంచ్ చలగల్ల వెంకటలక్ష్మి తల్లి మృతి చెందడంతో ఆమె కుటుంబ సభ్యులను, వైఎస్సార్ సీపీ నాయకుడు బొజ్జా రవి తండ్రి మృతి చెందడంతో ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించారు.

పాదరసంతో దేవుళ్ల ప్రతిమలు

అమలాపురం టౌన్: స్థానిక అబ్బిరెడ్డి కాలనీకి చెందిన చిటికెన సత్యనారాయణ శివరాత్రి సందర్భంగా పాదరసంతో శివుడు, దుర్గ, వినాయకుడి ప్రతిమలను తయారుచేశారు. రూ.12 వేల విలువైన 190 గ్రాముల పాదరసంతో మూడు అంగుళాల పరిమాణంతో శివుడు, రెండు అంగుళాల పరిమాణాల్లో దుర్గ, వినాయకుడి ప్రతిమలను రూపొందించారు.

గ్రహణం మొర్రికి ఉచిత శస్త్రచికిత్సలు

ముమ్మిడివరం: గ్రహణం మొర్రి బాధితులకు ఉచిత శస్త్రచికిత్సతో పాటు రవాణా ఖర్చులు సైతం ఇస్తారని సమగ్ర శిక్ష ఐఈ కోఆర్డినేటర్ ఎంవీవీ సత్యనారాయణ పేర్కొన్నారు. ముమ్మిడివరం మానవ వనరుల కేంద్రంలో గురువారం బసవతారకం ఇండో అమెరికన్ కేన్సర్ హాస్పటల్ సహకారంతో సమగ్ర శిక్ష ఆధ్వర్యంలో గ్రహణం మొర్రి స్క్రీనింగ్ క్యాంపు నిర్వహించారు. బసవతారకం వైద్యులు జోషి, డా.ముకుందరావులు ఆరు నెలల నుంచి 50 సంవత్సరాల లోపు గ్రహణం మొర్రి బాధితులకు ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహించారు. 35 మందికి బసవతారకం ఆసుపత్రిలో శస్త్రచికిత్స కోసం రిఫర్ చేశారు. కార్యక్రమంలో ఎంఈఓ బి.రమణశ్రీ,, ప్రత్యేక ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ముమ్మిడివరం: ముమ్మిడివరం 33/11 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో మరమ్మతులు, చెట్ల కొమ్మల తొలగింపు పనుల నిమిత్తం శుక్రవారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకూ విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడనుందని ట్రాన్స్‌కో ఈఈ ఎం.రవికుమార్ తెలిపారు. వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

ఘనంగా లక్ష కుంకుమార్చన

ఐ.పోలవరం: మండలంలోని కేశనకుర్రు గ్రామదేవత మల్లమాంబ అమ్మవారి ఆలయంలో గురువారం లక్ష కుంకుమార్చన పూజా కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఆలయ పండితులు, కమిటీ ఆధ్వర్యంలో జరిగిన పూజా కార్యక్రమాల్లో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించారు. అనంతరం అమ్మవారి తీర్థప్రసాదాలు స్వీకరించారు.

ధన సత్తెమ్మ తల్లి ప్రతిష్ఠ

యానాం: కనకాలపేటలో కొలువైన ధనసత్తెమ్మ తల్లి సంబరంలో భాగంగా గురువారం ప్రతిష్ఠా కార్యక్రమం వైభవంగా జరిగింది. స్థానిక కోనాగార్డెన్స్‌లో సత్తెమ్మ తల్లి తాడి వద్ద విశేష పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా కనకాలపేట, యూకేవీ నగర్, భీమ్‌నగర్ తదితర ప్రాంత ప్రజలు అమ్మకు తమ మొక్కులు చెల్లించుకున్నారు. ఈ నెల 18న మహాశివరాత్రిని పురస్కరించుకుని అమ్మవారి గుడి వద్ద గరగ నృత్యాలతో సంబరం నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ తెలిపింది.

మహాశివరాత్రికి సర్వం సిద్ధం

- మురమళ్ల వీరేశ్వరుడు ముస్తాబు
- ఏర్పాట్లు పూర్తి చేసిన అధికారులు
- భారీ పందిళ్లు, స్వాగత ద్వారాలు, విద్యుత్ దీపాలంకరణ



మురమళ్ల వీరేశ్వరస్వామి ఆలయం

ఐ.పోలవరం: మహాశివరాత్రికి ప్రసిద్ధి చెందిన మురమళ్ల శ్రీభద్రకాళీ సమేత వీరేశ్వరస్వామి శైవ క్షేత్రం ముస్తాబైంది. వీరేశ్వరుడి సన్నిధిలో శివరాత్రి ఉత్సవాలు ఈ నెల 18 నుంచి 22 వరకూ ఐదు రోజుల పాటు జరగనున్నాయి. ఆలయంతో పాటు కిలోమీటర్ మేర రహదారిపై విద్యుత్‌దీపాలతో అలంకరించారు. దర్శనానికి వచ్చే భక్తుల కోసం ప్రత్యేక క్యూలైన్లు, భారీగా చలువ పందిళ్లు వేశారు. ఆలయ ఆవరణలో ప్రధాన రహదారిపై ఐదు చోట్ల స్వాగత ద్వారాలు, విద్యుత్ కాంతులతో దేవతా మూర్తుల లైటింగ్ ఏర్పాటు చేశారు.

శివరాత్రికి ఉదయం 4 గంటల నుంచి స్వామివారి దర్శనాలు, అభిషేకాలు, కుంకుమ పూజలు జరుగుతాయి. ఉదయం నుంచి ఆలయ ఆవరణలో ఆధ్యాత్మిక ప్రవచనం, సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. మధ్యాహ్నం 12 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకూ దేశంలో ఏటా జరిగే పుష్కరాల నుంచి ద్వాదశ పుష్కరనది(గంగ, యమున, నర్మద, సరస్వతి, సింధు, ప్రణీత, భీమరథీ, పుష్కరిణి, తుంగభద్ర, గోదావరి, కృష్ణా, కావేరి) జలాలతో అభిషేకం చేయనున్నారు. సాయంత్రం 5 గంటలకు శూలాల సంబరం, బాజా భజంత్రీలతో, బాణసంచా కాల్పులతో, నాదస్వర బృందాలతో ధూపసేవ అనంతరం నందాదీపం ప్రజ్వలన చేస్తారు. రాత్రి 12 గంటలకు లింగోద్భవ కాల దర్శనం అనంతరం స్వామి, అమ్మవార్లకు మహా నివేదన ఉంటుంది. నిత్యం స్వామివారికి, అమ్మవారికి అభిషేకాలు, కుంకుమపూజలు చేయనున్నారు. ఉత్సవాల చివరి రోజు 22వ తేదీన సాయంత్రం 6 గంటలకు బ్యాండ్ మేళాలు, కోలాటాలతో భారీ ఊరేగింపుతో వృద్ధ గౌతమీ గోదావరిలో హంస వాహనంపై తెప్పోత్సవం నిర్వహిస్తారు. భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ప్రత్యేక క్యూలైన్లు, తాగునీరు, ఉచిత ప్రసాదం వంటి ఏర్పాట్లు చేశామని ఆలయ చైర్మన్ పెన్మత్స వాసురాజు, ఈఓ మాచిరాజు లక్ష్మీనారాయణలు చెబుతున్నారు.



శివరాత్రికి ఏర్పాటు చేసిన చలువ పందిళ్లు



ఆలయంలో ఏర్పాటుచేసిన ప్రత్యేక క్యూలైన్లు



భద్రకాళీ సమేత వీరేశ్వరస్వామి

ఐఎంఏ మాజీ అధ్యక్షుడు డాక్టర్ చిక్కం మృతి



డాక్టర్ సూర్యనారాయణమూర్తి (ఫైల్)

అమలాపురం టౌన్: అమలాపురానికి చెందిన ఇండియన్ మెడికల్ అసోసియేషన్(ఐఎంఏ) కోనసీమ శాఖ మాజీ అధ్యక్షుడు, పూర్వపు ఆంధ్రప్రదేశ్ ప్రైవేట్ నర్సింగ్ హోమ్స్ అసోసియేషన్ మాజీ అధ్యక్షుడు డాక్టర్ చిక్కం సూర్యనారాయణమూర్తి(75) అనారోగ్యంతో బుధవారం కన్నుమూశారు. మధుమేహ వ్యాధి నిపుణుడిగా డాక్టర్ చిక్కం పేరు గాంచారు. ఆయనకు భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. భార్య విజయలక్ష్మితో కలిసి ఆయన అమలాపురంలో గీతా నర్సింగ్ హోమ్ ద్వారా గత నాలుగు దశాబ్దాలుగా వైద్య సేవలందిస్తున్నారు. తన తల్లిదండ్రుల పేరుతో ట్రస్ట్ ఏర్పాటు చేసి సేవా కార్యక్రమాలు చేపట్టారు. ఆయన మృతికి విశ్రాంత జిల్లా జడ్జి చిక్కం విజయ మోహన్, ఆర్‌ఎస్‌ఎస్ నేత డాక్టర్ గోదశి గంగరాజు, ఐఎంఏ మాజీ అధ్యక్షుడు డాక్టర్ బసవా వరహాలు, చిక్కం హరిహరబాబు తదితరులు సంతాపం తెలిపారు.

విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ప్రారంభం



ట్రాన్స్‌ఫార్మర్ ప్రారంభిస్తున్న ఎస్ఈ మూర్తి

అమలాపురం టౌన్: స్థానిక వెంకటేశ్వరస్వామి ఆలయంలో నూతనంగా ఏర్పాటు చేసిన 100 కేవీ ట్రాన్స్‌ఫార్మర్‌ను ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా ట్రాన్స్‌కో ఎస్ఈ టీవీఎస్ఎన్ మూర్తి గురువారం ప్రారంభించారు. ఆలయంలో గత కొన్నేళ్లుగా విద్యుత్ సరఫరాలో అనేక ఇబ్బందులు ఎదరవుతున్నాయి. ఆలయ ధర్మకర్తల మండలి ఇటీవల ఈ సమస్యను జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లా దృష్టికి తీసుకెళ్లారు. కలెక్టర్ చొరవతో ఆలయానికి నూతన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ సమకూరిందని ఆలయ చైర్‌పర్సన్ దూడల వెంకట వీరీతాదేవి తెలిపారు. ప్రారంభోత్సవంలో ట్రాన్స్‌కో ఈఈ ఎం.రవికుమార్, ఆలయ ఈవో డి.సాయిబాబు, పట్టణ వైఎస్సార్ సీపీ యువజన కమిటీ అధ్యక్షుడు దూడల ఫణి తదితరులు పాల్గొన్నారు.

వెంకన్నను దర్శించుకున్న సినీ నటి కల్యాణి



సినీ నటి కల్యాణికి స్వామివారి చిత్రపటాన్ని అందిస్తున్న ఆలయ చైర్‌పర్సన్ వీరీతాదేవి

అమలాపురం టౌన్: స్థానిక వెంకటేశ్వరస్వామి ఆలయాన్ని సినీ నటి, తెలంగాణ రాష్ట్ర బీజేపీ నాయకురాలు కరాటే కల్యాణి గురువారం సందర్శించారు. స్వామి, అమ్మవార్లను ఆమె దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ చైర్‌పర్సన్ దూడల వెంకట వీరీతాదేవి, ఈవో దూనబోయిన సాయిబాబు, ధర్మకర్తలు, అర్చకులు ఆమెకు స్వామి చిత్రపటం, తీర్థ ప్రసాదాలు అందించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ పట్టణ యువజన కమిటీ అధ్యక్షుడు దూడల ఫణి, భజరంగ్ దళ్ నాయకుడు శిరంగు నాయుడు తదితరులు పాల్గొన్నారు.

వీరేశ్వరుని సన్నిధిలో సినీనటి కరాటే కల్యాణి

ఐ.పోలవరం: మురమళ్ల శ్రీభద్రకాళి సమేత వీరేశ్వరస్వామి వారిని గురువారం సినీనటి కరాటే కల్యాణి కుటుంబ సభ్యులతో కలిసి దర్శించుకున్నారు. వారికి ఆలయ అర్చకులు, పండితులు ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం ఆలయ ఈఓ మాచిరాజు లక్ష్మినారాయణ ఆలయ మర్యాదలతో స్వామి వారి చిత్రపటం, ప్రసాదం ఇచ్చి సత్కరించారు.

నేడు కన్నుల పండువగా స్వామివారి కల్యాణం



ఎస్.రామేశ్వరంలోని ఉమరామలింగేశ్వరస్వామి వారి ఆలయం

అల్లవరం: అల్లవరం మండలం ఎస్.రామేశ్వరం తీరంలో కొలువైయున్న పార్వతీ సమేత రామలింగేశ్వరస్వామి వారి ఆలయంలో శివరాత్రి ఏర్పాట్లు శరవేగంగా సాగుతున్నాయి. జిల్లా నలుమూలల నుంచి స్వామి వారి ఉత్సవాలకు వచ్చే భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నామని ఆలయ చైర్మన్ అంగాని రామారావు, ఈఓ ఎస్.సత్యమహేంద్ర గురువారం తెలిపారు. శుక్రవారం మధ్యాహ్నం నుంచి ప్రత్యేక పూజలు నిర్వహిస్తామని, రాత్రి స్వామి వారి కల్యాణం నిర్వహిస్తున్నామని ఆయన అన్నారు. సముద్ర స్నానాలు చేసే భక్తులకు ఎలాంటి ప్రమాదం జరగకుండా గజ ఈతగాళ్లని సిద్ధం చేశామన్నారు. శుక్రవారం రాత్రి నుంచి పోలీసులు, మెరైన్ పోలీసులు బందోబస్తు నిర్వహిస్తారన్నారు.

ఎన్ఎమ్ఎమ్ఎస్ఎస్ పరీక్ష దరఖాస్తులకు ఆహ్వానం

యానాం: ప్రభుత్వ, ప్రభుత్వ ఎయిడెడ్ పాఠశాలల్లో 8వ తరగతి చదువుతూ ఆర్థికంగా వెనుకబడిన వర్గాలకు చెందిన విద్యార్థుల ప్రోత్సాహక నిమిత్తం నిర్వహించే 'నేషనల్ మీన్స్ కమ్ మెరిట్ స్కాలర్‌షిప్'(ఎన్ఎమ్ఎమ్ఎస్ఎస్) పరీక్ష కోసం దరఖాస్తుల్ని ఆహ్వానిస్తున్నట్లు పుదుచ్చేరి విద్యాశాఖ సంచాలకులు డాక్టర్ వీజీ శివగామి గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ పరీక్షలో వచ్చిన మార్కుల ఆధారంగా మొత్తం 125 మంది విద్యార్థులకు 9వ తరగతి నుంచి 12వ తరగతి వరకూ సంవత్సరానికి రూ.12 వేల చొప్పున ఉపకార వేతనాన్ని ఇస్తారని చెప్పారు. అర్హులైన విద్యార్థులు ఫిబ్రవరి 16 నుంచి 28 వరకూ దరఖాస్తు చేసుకోవొచ్చన్నారు. మార్చి 18వ తేదీన యానాం, పుదుచ్చేరి, కారైకల్, మాహే కేంద్రాల్లో పరీక్ష నిర్వహించనున్నట్లు తెలిపారు.

విద్యుత్ బిల్లుల కౌంటర్ ఏర్పాటు

యానాం: యానాం నియోజకవర్గ పరిధిలోని శివారు గ్రామం అడివి పాలెం 33 కేవీ సబ్‌స్టేషన్ పరిధిలోని విద్యుత్ వినియోగదారుల కోసం నూతనంగా ప్రత్యేక కౌంటర్‌ను ఏర్పాటుచేసినట్లు విద్యుత్‌శాఖ అసిస్టెంట్ ఇంజినీరు లంక కృష్ణారావు గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ విద్యుత్ బిల్లుల కౌంటర్ ద్వారా దరియాలతిప్ప, దొమ్మేటిపేట, గిరియాంపేట, సావిత్రినగర్, వంశీనగర్, సీతారామ నగర్, పరంపేట గ్రామాల విద్యుత్ వినియోగదారులు బిల్లులను చెల్లించుకోవొచ్చన్నారు. ఆర్థిక సంవత్సరం ముగుస్తున్నందున విద్యుత్ బకాయిలున్నవారు తక్షణం చెల్లించాలని, లేదంటే వారి విద్యుత్ కనెక్షన్లను తొలగిస్తామని హెచ్చరించారు.

మంచు తెరలు.. ఉపాధికి పరుగులు



గృహ సామగ్రి అమ్మకానికి బయలుదేరిన చిరువ్యాపారి



దారి కనిపించక ఇబ్బంది పడుతున్న ప్రజలు

ఉప్పలగుప్తం: పగలంతా వాతావరణం వేడిగా ఉంటున్నా ఇప్పటికీ కోనసీమలోని అనేక గ్రామాల్లో ఉదయం 9 గంటలైనా మంచు తెరలు వీడడం లేదు. గ్రామాలన్నీ మంచు దుప్పటి కప్పుకున్నా కూలీలు, చిరు వ్యాపారులు ఉపాధి కోసం పరుగులు తీయక తప్పని పరిస్థితి నెలకొంటుంది. ఉప్పలగుప్తం మండల గ్రామాల్లో గురువారం ఉదయం 9 గంటలైనా మంచు వీడకపోవడంతో ఎదురుగా వచ్చే వాహనాలు కనిపించక విద్యార్థులు, ఉద్యోగులు తమ గమ్యస్థానాలను చేరుకోవడానికి ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఆ చిత్రాలను ×సాక్షి₹ క్లిక్‌మనిపించింది. మంచు దుప్పట్లో దాక్కుంటున్న కోనసీమ అందాలను చిత్రీకరించడానికి పలువురు ప్రకృతి ప్రేమికులు ఆసక్తి చూపిస్తున్నారు.

ఎలుకల నివారణ మందు పంపిణీ

తాళ్లరేవు: మండల పరిధిలోని పలు పంచాయతీల్లో గురువారం ఎలుకల నివారణ కార్యక్రమాన్ని నిర్వహించారు. సామూహిక ఎలుకల నివారణ కార్యక్రమంలో భాగంగా వ్యవసాయ సహాయకులు ఎలుకల వల్ల కలిగే నష్టాలను రైతులకు వివరించారు. అనంతరం ఎలుకల నివారణకు ఎర తయారు చేసే విధానాన్ని వివరించి బ్రోమోడయోలిన్ మందును అందజేశారు. ఈ కార్యక్రమాలలో వ్యవసాయ అధికారులు, రైతులు పాల్గొన్నారు.

అత్యాచార ఆరోపణలపై డీఎస్పీ విచారణ

కాట్రేనికోన: కాట్రేనికోన మండలం చిర్రయానం గ్రామంలో మంచినీటి కోసం వెళ్లిన మైనర్ బాలికపై ఐదుగురు యువకులు అత్యాచారానికి పాల్పడ్డారని సోషల్ మీడియాలో హల్‌చల్ కావడంతో అమలాపురం డీఎస్పీ మాధవరెడ్డి విచారణ చేపట్టారు. ఈ విషయం ఆలస్యంగా వెలుగులోకి రావడంతో డీఎస్పీ ఆధ్వర్యంలో పోలీసులు గ్రామానికి చేరుకుని సదరు మైనర్ బాలికతో పాటు తల్లిదండ్రులను విచారించారు. డీఎస్పీతో పాటు ముమ్మిడివరం సీఐ జానకిరామ్, ఎస్ఐ టి.శ్రీనివాస్, వీఆర్వో వెంకటేశ్వరరావు తదితరులున్నారు.

జూదమాడుతున్న 9 మంది అరెస్ట్

తాళ్లరేవు: మండల పరిధిలోని పలు ప్రాంతాల్లో జూదం ఆడుతున్న 9 మందిని అరెస్ట్ చేసినట్లు కోరంగి ఎస్ఐ పి.శ్రీనివాసకుమార్ తెలిపారు. గురువారం ఆయన చెప్పిన వివరాల ప్రకారం పోలేకుర్రు పంచాయతీ చినబాపనపల్లి ప్రాంతంలో కోడి పందేలు ఆడుతున్నట్లు అందిన సమాచారంతో దాడి చేసి కోడి పందేలు ఆడుతున్న ఆరుగురిని అరెస్ట్ చేశారు. స్థానిక సమాచారం ఆధారంగా గాడిమొగ పంచాయతీ లక్ష్మీపతిపురంలో పేకాట శిబిరంపై దాడి చేసి ముగ్గురు వ్యక్తులను అరెస్ట్ చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

వైఎస్సార్ కంటి వెలుగు పరీక్షలు

ఉప్పలగుప్తం: వైఎస్సార్ కంటి వెలుగు పథకంలో భాగంగా గొల్లవిల్లి గ్రామంలో సర్పంచ్ జొన్నాడ శ్రీదుర్గ ఆధ్వర్యంలో కంటి వెలుగు పరీక్షలు నిర్వహించారు. శిబిరంలో 60 ఏళ్లు పైబడిన వృద్ధులకు గురువారం వైద్య పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ మారిశెట్టి దుర్గారావు, సొసైటీ అధ్యక్షుడు మారిశెట్టి పుండరీకాక్షుడు, పరమట సత్యనారాయణ, నక్కా పద్మశ్రీ తదితరులు పాల్గొన్నారు.

ప్రజలకు మెరుగైన వైద్యసేవలందించాలి

ఎమ్మెల్యే పొన్నాడ వెంకట సతీష్‌కుమార్



వైద్య పరీక్షలు చేయించుకుంటున్న ఎమ్మెల్యే పొన్నాడ వెంకట సతీష్‌కుమార్

తాళ్లరేవు: తాళ్లరేవులో నూతనంగా ఏర్పాటు చేసిన సూర్య మల్టీ స్పెషాలిటీ ఆస్పత్రి ద్వారా ప్రజలకు మెరుగైన సేవలందించాలని ఎమ్మెల్యే పొన్నాడ వెంకట సతీష్‌కుమార్ కోరారు. గురువారం తాళ్లరేవు బైపాస్ రహదారిలో నూతనంగా ప్రారంభించిన ఆస్పత్రిని ఆయన స్థానిక నాయకులతో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా ఆస్పత్రి అధినేత మచ్చా గంగాధర్‌రావు, ఆయన తనయుడు, వైద్యుడు సురేష్ ఆస్పత్రిలోని సేవలను ఎమ్మెల్యేకు వివరించారు. మండలంలో తొలిసారిగా మల్టీ స్పెషాలిటీ ఆస్పత్రిని ప్రారంభించినందుకు ఎమ్మెల్యే వారిని అభినందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వైద్యపరీక్షలు చేయించుకున్నారు. కార్యక్రమంలో ఎంపీపీ రాయుడు సునీత, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి దున్నా జనార్దనరావు, పార్టీ మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కాద గోవింద కుమార్, రాయుడు గంగాధర్, వైస్ ఎంపీపీ ధూళిపూడి నాగేంద్రప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేకు ఆరు గ్రామాల ప్రజల వినతి

ఐ.పోలవరం: తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ స్థానిక జెడ్పీటీసీ ముదునూరి సతీష్‌రాజు ఆధ్వర్యంలో ఎమ్మెల్యే పొన్నాడ వెంకట సతీష్‌కుమార్‌కు రామాలయం పేట, కమిడి వారిపేట, బీసీ పేట, గణేష్ నగర్, భవాని పేట, కరవాకలంక గ్రామాల ప్రజలు గురువారం వినతి పత్రం అందజేశారు. తమ గ్రామాల్లో నివసించేవారంతా బయటకు రావాలంటే ఏటిగట్టు ఒక్కటే మార్గమన్నారు. ప్రస్తుతం ఏటిగట్టుపై ఓఎన్‌జీసీ భారీ వాహనాలతో నిరంతరం జి.మూలపొలం సైట్‌కు కంకర, యంత్రాలు తరలిస్తున్నారన్నారు. దీని వల్ల ఏటిగట్టు పాడవడమే కాకుండా తాము నివాసముండే ఇళ్లు సైతం బీటలు వారి బలహీన పడిపోతున్నాయని ఫిర్యాదులో పేర్కొన్నారు. పక్కా ఇళ్లు, ఏటిగట్ల పరిరక్షణకు ఓఎన్‌జీసీ సంస్థచే ఆర్థిక సాయం ఇప్పించాలని కోరారు. దీనిపై స్పందించిన ఎమ్మెల్యే సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి సమస్య పరిష్కరించేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు.

ఎంపీ అనురాధని కలిసిన కుడుపూడి



ఎంపీ అనురాధని కలిసిన శెట్టిబలిజ సంక్షేమ సంఘం కన్వీనర్ కుడుపూడి సూర్యనారాయణ

అల్లవరం: రాష్ట్ర శెట్టిబలిజ సంక్షేమ సంఘం కన్వీనర్ కుడుపూడి సూర్యనారాయణ మొగళ్ళమూరులోని ఎంపీ అనురాధని ఆమె నివాసంలో గురువారం మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎంపీ అనురాధతో పార్టీ వ్యవహారాలు, స్థానిక పరిస్థితులపై చర్చించారు. ఆయన వెంట ఏపీ అగ్రికల్చర్ మిషన్ సభ్యుడు జున్నూరి రామారావు, వైఎస్సార్ సీపీ టౌన్ మాజీ అధ్యక్షుడు మట్టపర్తి నాగేంద్ర, అంబికా శ్రీను, సీతాపతిరాజు తదితరులున్నారు.

ప్రజాసంక్షేమమే లక్ష్యం కావాలి



మండల సర్వసభ్య సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ రాయుడు సునీత

తాళ్లరేవు: ప్రజా సంక్షేమమే లక్ష్యంగా ప్రజాప్రతినిధులు, అధికారులు కలిసికట్టుగా సమన్వయంతో పనిచేయాలని ఎంపీపీ రాయుడు సునీత అన్నారు. గురువారం స్థానిక మండల పరిషత్ కార్యాలయం సమావేశపు మందిరంలో ఎంపీపీ సునీత అధ్యక్షతన మండల ప్రజా పరిషత్ సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సందర్భంగా మండలంలోని పలు గ్రామాల్లో నెలకొన్న సాగునీరు, తాగునీటి ఇబ్బందులను సభ్యులు లేవనెత్తారు. దీనిపై స్పందించిన ఎంపీపీ సునీత మాట్లాడుతూ ప్రజలకు అత్యవసరాలైన తాగునీరు, సాగునీటి సమస్యలను అధికారులు సత్వరమే పరిష్కరించాలని ఆదేశించారు. విద్యుత్ కోతలు లేకుండా చూడాలని అధికారులను కోరారు. ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో అభివృద్ధి పథకాలపై ఎటువంటి చర్చ లేకుండానే సమావేశాన్ని ముగించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ ఎం.అనుపమ, తహసీల్దార్ ఎస్.పోతురాజు, ఎంపీటీసీ సభ్యులు, పలువురు సర్పంచ్‌లు హాజరయ్యారు.

వేతనాలు పెంచాలంటూ ఆర్‌ఏఓకు వినతి



ఆర్ఏఓ మునిస్వామికి వినతి పత్రం ఇస్తున్న కార్మికులు

యానాం: రుంగ్టా ఇరిగేషన్ లిమిటెడ్ ఫ్యాక్టరీలో పని చేసే కార్మికులకు నిబంధనల ప్రకారం కనీస వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేస్తూ గురువారం ఆర్ఏఓ మునిస్వామికి కార్మికులు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తామంతా గత 20 ఏళ్ల నుంచి ఫ్యాక్టరీలో కార్మికులుగా పని చేస్తున్నామని, కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాల్సి ఉన్నా దాన్ని అమలు చేయడం లేదన్నారు. నైపుణ్యత ఆధారంగా జీతాల పెంపు, గుర్తింపు కార్డుల మంజూరు, ఈఎస్ఐ, పీఎఫ్ అమలు తదితర 9 డిమాండ్లతో వినతి పత్రాన్ని ఇచ్చారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకుడు జి.దుర్గాప్రసాద్, టి.మాధుసూదన్, పి.మణికంఠ, పి.సుధీర్ తదితరులు పాల్గొన్నారు.

రాంబాబు సేవలు చిరస్మరణీయం

అమలాపురం టౌన్: లయన్స్ క్లబ్ జోన్ చైర్మన్‌గా, సంస్కార భారతి అధ్యక్షుడిగా, వాకర్స్ క్లబ్ ఉపాధ్యక్షుడిగా సేవలందించిన కూచిమంచి రాంబాబు చిరస్మరణీయుడని పలువురు వక్తలన్నారు. స్థానిక భూపయ్య అగ్రహారంలో లయన్స్, సంస్కార భారతి, వాకర్స్ క్లబ్ సంయుక్త ఆధ్వర్యంలో గురువారం జరిగిన రాంబాబు సంస్మరణ సభలో ఆ మూడు సంస్థలు ప్రతినిధులు ప్రసంగించారు. రచయిత పుత్సా కృష్ణ కామేశ్వర్ రచించిన శ్రీమదాంధ్ర మహాభారతం సరళ వచనం గ్రంథాలను దివంగత రాంబాబుకు అంకితమిచ్చారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ అధ్యక్షుడు జంపన సుమన్‌వర్మ, సంస్కార భారతి అధ్యక్షుడు ఆకొండి పవన్‌కుమార్, వాకర్స్ కార్యదర్శి పుత్సా కృష్ణ కామేశ్వర్, డాక్టర్ పీఎస్ శర్మ తదితరులు పాల్గొన్నారు.

ధనలక్ష్మి, కల్యాణలక్ష్మిలకు విశేష పూజలు

యానాం: పట్టణపరిధిలో రామరాజుగార్డెన్స్‌లో ఉన్న ధనలక్ష్మి, కల్యాణలక్ష్మి అమ్మవారి నూతన ఆలయ శిఖర విగ్రహ ప్రతిష్ఠా మహోత్సవం మూడో రోజు గురువారం వైభవంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ముమ్మిడివరం ఎమ్మెల్యే పొన్నాడ వెంకట సతీష్‌కుమార్ హాజరై అమ్మవారికి విశేష పూజలు నిర్వహించారు. అమ్మవార్లకు పూర్ణాహుతి, గోదృష్టి, కళావాహన, శాంతికల్యాణం తదితర పూజలు నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు హాజరై అమ్మవారిని దర్శించుకున్నారు.

వెంకన్న కల్యాణోత్సవాలపై సమావేశం

యానాం: స్థానిక ఆర్‌ఏఓ చాంబర్‌లో భూసమేత శ్రీవెంకటేశ్వరస్వామి(మీసాలవెంకన్న) కల్యాణ మహోత్సవాలపై రీజనల్ అడ్మినిస్ట్రేటర్ మునిస్వామి అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఈ నెల 21 నుంచి మార్చి 2 వరకూ ఉత్సవాలు, 3న గరుడ వాహనం, 4న స్వామివారి కల్యాణోత్సవం, 5న పొన్నవాహనం, 6న రథయాత్ర, 7న చక్రతీర్థం, 8 నుంచి 11 వరకూ పుష్పయాగాలు, 12 నుంచి 16 వరకూ కొఠాయి ఉత్సవాలను నిర్వహించనున్నట్లు తెలిపారు. దీనికి కావాల్సిన ఏర్పాట్లు యానాం ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ ఆధ్వర్యంలో జరుగుతాయన్నారు. కార్యక్రమంలో ఉత్సవదారులు బెజవాడ నిరంజనరావు, నల్లం సురేష్, గ్రంధి వెంకటేశ్వరరావు, కసిరెడ్డి బాబు, కాపగంటి జయబాబు తదితరులు పాల్గొన్నారు.

ప్రాజెక్టుల నిర్వహణతో ఉద్యోగవకాశాలు

తాళ్లరేవు: ఇంజినీరంగ్ విద్యార్థులు ప్రాజెక్టులను తయారుచేయడం ద్వారా ప్లేస్‌మెంట్‌ల్లో మంచి ఉద్యోగాలు సాధించొచ్చని పలువురు వక్తలన్నారు. గురువారం కైట్ ఇంజినీరింగ్ కళాశాలలో మైక్రోసాఫ్ట్, ఎడ్యునెట్‌తో కలిసి టెక్‌సాక్సమ్ అనే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు కోడింగ్ నేర్పించి పలు ప్రాజెక్టులు చేయించారు. ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్ ప్రోగ్రాం ద్వారా ప్రాజెక్టులు నిర్వహించి టాప్ 5 ప్రాజెక్టులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమానికి కైట్ కళాశాల విద్యార్థులతో పాటు జిల్లాలోని ఇతర కళాశాలల విద్యార్థులు సైతం హాజరైనట్లు కైట్ కళాశాల ప్రిన్సిపాల్ దూబే రేవతి తెలిపారు.

ఎయిరో ఇండియా ప్రదర్శనలో పాల్గొన్న ఎమ్మెల్యే

యానాం: కర్ణాటక రాజధాని బెంగుళూరులో ప్రారంభమైన ఎయిరో ఇండియా-2023 ప్రదర్శనకు హాజరైనట్లు ఎమ్మెల్యే గొల్లపల్లి శ్రీనివాస్ అశోక్ గురువారం తెలిపారు. ఈ సందర్భంగా స్వదేశీ పరిజ్ఞానంతో రూపొందించిన తేజస్, లైట్ హెలికాప్టర్, తదితర రక్షణ విమాన యానరంగ విశేషాలను ప్రదర్శించినట్లు తెలిపారు.

సాగు నీటి కోసం రైతుల ఆందోళన

తాళ్లరేవు: మండల పరిధిలోని చొల్లంగి పంచాయతీలో సాగునీరు లేక వరిపొలాలు ఎండిపోతున్నాయని రైతులు గురువారం ఆందోళన చేశారు. జాతీయ రహదారి 216లో రైతులు రాస్తారోకో చేసి నిరసన వ్యక్తం చేశారు. గత 20 రోజులుగా సాగునీరు పూర్తిస్థాయిలో రాకపోవడంతో వరిచేలు ఎండిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులు స్పందించి సాగునీటిని సరఫరా చేయాలని కోరారు.